క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం షీటీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. షీటీం ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జీ ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. అనంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్, కానిస్టేబుల్ విఘ్నేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోర్టు నూతన భవనం ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో గల సీనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం పక్కనే ఉన్న నూతన భవనంలోకి మార్చారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి నసీమ్ సుల్తానా భవనాన్ని ప్రారంబించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట విప్లవ్‌కిరణ్, ప్రధానకార్యదర్శి ప్రవీణ్ చందర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు బీఆర్‌ఎస్ పెద్దపీట



ఆర్మూర్‌టౌన్: మైనార్టీలకు బీఆర్‌ఎస్ పెద్దపీట వేసిందని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్ను అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మైనార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గ మైనార్టీల అభివృద్ధి కోసం తీసుకువచ్చినంత నిధులు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో రాలేవన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మైనార్టీలు సంతోషంగా ఉన్నారని అన్నారు. మైనార్టీ నాయకులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికే పోరాటం



ఆర్మూర్‌టౌన్: ప్రజల సమస్యల పరిష్కారానికే వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎల్లప్పుడు పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ అన్నారు. ఆర్మూర్‌లోని వివిధ కాలనీలో శనివారం పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా రాజన్న బిడ్డను ఆశీర్వదించి, రాజన్న పాలన తీసుకురావాలని కోరారు. నాయకులు మోహన్ నాయక్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కిషన్, సీనియర్ నాయకులు దినేష్, మోనిత, రాధ పాల్గొన్నారు

అసత్య ఆరోపణలు సరికాదు

నవీపేట: సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఎంపీ అర్వింద్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



రుద్రూర్/బాల్కొండ/వేల్పూర్/మాక్లూర్: గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు రాకుండా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది నట్టలనివారణ మందు వేశారు. రుద్రూర్, బాల్కొండ, వేల్పూర్, మాక్లూర్ సహా పలు మండలాల్లో మందు పంపిణీని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. పోతంగల్ మండలం పోతంగల్, కారేగాం గ్రామాల్లో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ బస్వారెడ్డి పరిశీలించారు. వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్‌లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును సర్పంచ్ సొడ రమేష్, ఎంపీటీసీ సొడ చందన్ పంపిణీ చేశారు.

జాగా కనిపిస్తే పాగా!

- బాల్కొండలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువు
- యథేచ్ఛగా కబ్జా చేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



1333 సర్వే నంబర్‌లో తొలిగించిన గుడిసెలు (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. పాగా వేయుటకు కబ్జాదారులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లుతోంది. ప్రజాప్రతినిధులే దగ్గరుండి భూమును కబ్జాలు చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని 1333 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా గుడిసెలు వేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, గుడిసెలను తొలిగించారు. కానీ అదే సర్వే నంబర్‌లో కొందరు ఏకంగా ఇళ్లు నిర్మించారు. వారి సంగతేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇలా అనేక సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి కబ్జాల పాలైంది. వాటన్నింటి సంగతి కూడ తేలిస్తే ప్రభుత్వ భూములకు రక్షణ లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

భూముల ధరలకు రెక్కలు..

బాల్కొండ మండల కేంద్రంలో గత కొంత కాలంగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. గజం స్థలం రూ.50వేల వరకు పలుకుతోంది. దీంతో రియల్టర్లు కొందరు ప్రభుత్వ భూములపై కబ్జా గురి పెట్టారు. ఒక సర్వే నంబర్ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటు మరో సర్వే నంబర్‌పై డ్యాక్యుమెంట్లు తయారు చేసుకున్న సంబంధిత అధికారులకు పట్టించుకోవడం లేదు. 1333 సర్వే నంబర్ గల భూమికి 1329 సర్వే నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇలా 20 వరకు డ్యాక్యుమెంట్లు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే ఇళ్ల నిర్మాణాలు కూడ ఇష్టారీతిలో సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండనే నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు ముడుపులు ముట్టజెప్పితే కమర్షియల్ రూంలు నిర్మించాలన్న టౌన్‌ప్లాన్‌కు వెళ్లకుండ జీపీలోనే కానీయవచ్చు. ఇలాంటి వెసులుబాటును ఆసర చేసుకుని మండల కేంద్రంలో ప్రభుత్వా భూములపై కబ్జాదారులు కన్ను వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే చేపడుతాం..

బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల పై పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి ప్రభుత్వ భూములను గుర్తిస్తాం. భూములు కబ్జాకు గురికాకుండ చర్యలు తీసుకుంటాం. 1333 సర్వే నంబరు ప్రభుత్వ భూమిని గుర్తించి ఫెన్సింగ్ వేస్తున్నాం.

– వినోద్, తహసీల్దార్, బాల్కొండ

పేదలకు న్యాయం చేయండి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎడపల్లి(బోధన్): ప్రభుత్వ భూములను కాపాడి, పేదలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పార్టీ నేతలు, పేదలతో కలిసి ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు లత, గంగాధర్ మాట్లాడుతూ.. మండలంలోని జానకంపేట గ్రామంలోగల ప్రభుత్వ భూమిలో పేదలు కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. ఉపసర్పంచ్ విజయ్‌కుమార్ పేదలపై దాడి చేసి, భూమి కబ్జాకు యత్నిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు విగ్నేష్, బాలరాజు, రాములు, సాయిలు, లక్ష్మణ్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, దానికి అనుగుణంగా కష్టపడి చదవాలని ఇస్రో యువ శాస్త్రవేత్త ఆల్గోట దేవేందర్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. అనంతరం ఆల్గోట దేవేందర్‌ను హెచ్‌ఎం మాధవరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



విద్యుత్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట శనివారం విద్యుత్‌శాఖ ఉద్యోగులు నల్లబ్యాడ్జి ధరించి నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్ జేఏసీ చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్‌తో పాటు తదితర సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. లేనిచో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగులు శ్రీనివాస్, సంజీవ్, పోశెట్టి, మూర్తి, గంగాధర హరిస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ఈనెల 27న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం రమేష్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతుందన్నారు.నాయకులు నన్నేసాబ్, గంగాధర్, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు .

నేడు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సమావేశం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అను బంధంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు గడీల శ్రీకాంత్‌గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకానున్నట్లు తెలిపారు.



మోటారు పడవ ప్రారంభం

నవీపేట: మండలంలోని నందిగామ శివారులో గోదావరి నదిపై శనివారం మోటారు పడవను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ ప్రారంభించారు. సొంత డబ్బుల తో పడవను ఏర్పాటు చేసిన ఎంపీటీసీ లలిత దంపతులను ఆయన అభినందించారు. జన చైతన్యవేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

బీజేపీకి అపూర్వ స్పందన

నవీపేట: మారుమూల గ్రామాలలో బీజేపీకి అపూర్వ స్పందన లభిస్తోందని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో శనివారం ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించి, మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు శివప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్, ఆదినాథ్, వంశీమోహన్, రామకృష్ణ, ఆనంద్, నాగేశ్వర్‌రావ్, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ



భీమ్‌గల్: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న వారికి జీవో 58కింద క్రమబద్ధీకరణకు గతంలో ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో భీమ్‌గల్ అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి 21 మంది దరఖాస్తులు చేసుకోగా అధికారులు 20మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో రూరల్ ప్రాంతానికి చెందిన 19మందికి జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ శనివారం పట్టాలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నేతలు నర్సయ్య, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ టెస్టులో జెడ్పీహెచ్‌ఎస్ పోచంపాడ్‌కు చెందిన ఎండీ సఫియా మూడవ స్థానంలో నిలవగా, ఆర్మూర్ మోడల్ స్కూల్‌కు చెందిన సయ్యద్ అ హ్మద్ నాలుగో స్థానంలో నిలిచినట్లు ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు శివ ప్రసాద్, రఘునాథ్ తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఎఫ్‌పీఎస్‌టీ నాయకులు అభినందించారు.

తీరిన లోవోల్టేజీ సమస్య

వేల్పూర్: మండలం కొత్తపల్లి ఎస్ గ్రామంలో రహదారులు, భవనాల శాఖమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో లోవోల్టేజి సమస్య తీరిందని సర్పంచ్ ఆరె నితీష్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి గ్రామంలో 25 కేవీ.ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించడంతో సమస్య తీరిందన్నారు. ఈసందర్భంగా జీపీ పాలకవర్గం, వీడీసీ సభ్యులు మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని ఎంపీపీ పస్క నర్సయ్య సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు బడులు, హాస్టళ్లు, అంగన్‌వాడీకేంద్రాల్లో భోజనాన్ని తరచూ పరిశీలించాలన్నారు. నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్మూర్, ఆలూర్ మండలానికి మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు సమావేశంలో నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ గంగారం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

వేల్పూర్: విద్యార్థులు బాగా చదివి ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పడగల్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకాలను తిలకించారు. ఎంఈవో వనజ, సర్పంచ్ వర్షిణి రాజ్‌కుమార్, ఎంపీటీసీలు ఆమోస్, శ్యాంరావు, ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం జమాలుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు పద్ధతి మార్చుకోండి



బోధన్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ నాయకులను బెదిరించడం సరికాదని, బీఆర్‌ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోవాలని పట్టణ బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఏ పార్టీ సొత్తు కాదని, విగ్రహ ఏర్పాటు విషయంలో జైలుకు వెళ్ళింది బీజేపీ నాయకులని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు అభివృద్ధిపై మాట్లాడకుండా మత రాజకీయాలపై ఎందుకు మాట్లాడుతున్నారన్నారు. నాయకులు బాలరాజు, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని, వినోద్, రామారాజు, అశోక్‌గౌడ్, హన్మండ్లు చారీ, వాసు, ధర్మపురి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పని చేయండి



కూనిపూర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రుద్రూర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వర్ని మండలం జాకోరా, కూనీపూర్, కూనీపూర్ క్యాంప్, జలాల్ పూర్ గ్రామాల్లో శనివారం హత్ సే హత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాలు ఎగురవేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్‌లు డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, అద్వకేట్ వెంకట్రామ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు సురేష్‌బాబా, గంగాప్రసాద్, గంగప్ప పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

జ్యోతిర్లింగ ఆశ్రమంలో అన్నదానం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని దోభిఘాట్ వద్ద గల జ్యోతిర్లింగ ఆశ్రమంలో సిందే మధుకర్ మహారాజ్ శనివారం హనుమాన్ దీక్ష భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ప్రతి పౌర్ణమి, అమవాస్య రోజు అన్నదానం ఉంటుందని మధుకర్ మహారాజ్ తెలిపారు. జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోర్దదేవేందర్ తెలిపారు.

శివాలయంలో మంత్రి పూజలు



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివాలయంలో శనివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, సర్పంచ్ మారెల్లి విష్ణు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హన్మాన్ మండల దీక్షలు ప్రారంభం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి, కోనాసముందర్ తదితర గ్రామాల్లో హన్మాన్ భక్తులు శనివారం మండల దీక్ష (41 రోజులు) తీసుకున్నారు. కమ్మర్‌పల్లిలో జంబి హన్మాన్ ఆలయంలో 60 మంది దీక్షాపరులకు పురోహితులు రమేష్‌చంద్రశాస్త్రి మాలధారణ చేశారు.

శ్రీవారి ఆలయంలో అన్నదానం



బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానికి ఏడాది పూర్తయింది. కార్యక్రమాన్ని నిలిపి వేయకుండ నిరంతరం అన్నదానం నిర్వహిస్తామని స్థానికులు అంటున్నారు. శనివారం నిర్వహించిన అన్నదానంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని కోట మైసమ్మ సహిత లక్ష్మి నరసింహా స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ మాట్లాడుతూ.. ఆలయ శిఖరం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ ప్రేమ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు ఇంటర్ విద్యపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు ఇంటర్మీడియట్ విద్య, తర్వాతి కోర్సులపై అవగాహన కల్పిస్తున్నట్లు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ మనోవిజ్ఞాన నిపుణుడు, విద్యావేత్త రాచకొండ చంద్రశేఖర్ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



రుద్రూర్: కోటగిరిలో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కోటగిరి ఆస్పత్రికి నిధులు మంజూరు చేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విహారయాత్రలో లిల్లిపుట్ విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాల విద్యార్థులు శనివారం మాక్లూర్ మండలం మదనపల్లి సుభాష్ గార్డెన్‌కు విహారయాత్రకు వెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృక్షాలను రక్షించాలి

మాక్లూర్: ప్రాణవాయువును ఇచ్చే వృక్షాలను రక్షించాలని ఆర్మూర్ డివిజన్ అటవీశాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అడవి మామిడిపల్లి శివారు చిన్నాపూర్ గండిలోగల అర్బన్‌పార్కును బాల్కొండలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా అటవీశాఖ అధికారులు విద్యార్థులతో వనదర్శిని కార్యక్రమం నిర్వహించి చెట్ల పెంపకం గురించి వివరించారు.

నిధులు మంజూరు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లో నిర్మిస్తున్న దేవాంగ సంఘ భవన నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.5లక్షలు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా కొటార్మూర్ దేవాంగ సంఘం నాయకులు నిధులు మంజూరు చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాజేశ్వర్ రెడ్డిని శనివారం అంకాపూర్‌లో ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



నవీపేట: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ బత్తూర్ సాయిలు అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.